## ఆయిల్‌పామ్‌కు అండ కరువు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో కొబ్బరి సాగు గణనీయంగా పెరుగుతున్నా, రాష్ట్రంలో కొబ్బరి బోర్డు ఏర్పాటుపై కేంద్రం ఎలాంటి ప్రకటన చేయకపోవడం దురదృష్టకరమన్నారు. రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాల్సిన కేంద్రం, ఎరువులపై సబ్సిడీలు తగ్గించడం ద్వారా ధరలు పెరిగేలా చేస్తోందని మంత్రి విమర్శించారు. ఎరువుల ధరల పెంపుతో సాగు ఖర్చులు భారమై, రైతులు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందన్నారు. నిర్మల బడ్జెట్ తెలంగాణ రైతుల ఆశలపై నీళ్లు చల్లిందని, కేంద్రం తన వైఖరిని మార్చుకుని రాష్ట్రానికి రావాల్సిన వాటాను, నిధులను వెంటనే కేటాయించాలని తుమ్మల డిమాండ్ చేశారు.

## ముందు మా ఫోన్‌లే ట్యాప్ చేశారు

మొదటి పేజీ తరువాయి

'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు సున్నా' అని ఒక్కొక్కరు ఒక్కో తీరుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒకే కుటుంబం నుంచి ఒక్కొక్కరు ఒక తీరుగా వ్యాఖ్యానిస్తున్నారన్నారు. బడ్జెట్‌పై ఒక దిక్కు కేటీఆర్.. ఇంకో దిక్కు హరీశ్‌రావు, కవిత మాట్లాడుతున్నారని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో దక్షిణ భారతదేశానికి ఏడు హైస్పీడ్ రైళ్లు కేటాయిస్తే అందులో హైదరాబాద్‌కు మూడు హైస్పీడ్ రైళ్లు కేటాయించడం జరిగిందని చెప్పారు. ఈ విషయం.. బావబామ్మర్దులకు కనిపించడం లేదా?, అని ప్రశ్నించారు. గత బడ్జెట్ కంటే రైల్వే రంగానికి ఈసారి 15 శాతం ఎక్కువ బడ్జెట్ కేటాయించామన్నారు ఈ బడ్జెట్‌లో తెలంగాణకు సున్నా అని చెబుతున్నరాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఓసారి బడ్జెట్‌ను పరిశీలించాలని సూచించారు. గతంలో కంటే ఈసారి రూ.1300 కోట్లు రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేటాయించారని రఘునందన్ రావు స్పష్టం చేశారు.

## కెసిఆర్‌ను విచారించొద్దా?

మొదటి పేజీ తరువాయి

ఇంకా సాగదీయకుండా విచారణను తుది దశకు తేవాలని డిమాండ్ చేశారు. గుంట నక్కలతో కలిసి అధికార కాంగ్రెస్ డ్రామాలాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ఈ కేసులో విచారణ పూర్తి చేస్తారని నమ్మకం తనకు లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసమే కొన్ని రోజులు ఈ కేసును అటు, ఇటు తిప్పుతున్నారని చెప్పారు. నిజంగా కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే రెండేళ్లుగా ఎందుకు కేసు ముందుకు పడటం లేదని ప్రశ్నించారు. ఈ కేసు దర్యాప్తు పైటల్‌కు స్టాండ్ వేసి తొక్కినట్టుగా ఉందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థి చెల్లెదైనా సరే.. కేసీఆర్‌ను చూసి ఓటు వేయాలని కేటీఆర్ కోరుతున్నారని కవిత ఆరోపించారు. ఇలాంటి రాచరిక, నియంతృత్వ పోకడలను మార్చుకోకుంటే బీఆర్ఎస్‌ను ఎవరు కాపాడలేరని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ రాజకీ కోసం అనుసరిస్తుందే కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పట్టించుకోవటం లేదన్నారు. ఇవ్వగలిగే స్థానిలో ఉండి కూడా బీజేపీ తెలంగాణకు రూపాయి ఇవ్వడం లేదని ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో పొలిటికల్ వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. యువత, మహిళలు, మేధావులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. విదేశీ పర్యటనకు వెళ్లి అక్కడ మల్టీనేషన్ కంపెనీతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ బూటకమన్నారు. అక్కడ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి... పెట్టుబడులు తీసుకువచ్చామనడం కట్టుకథలేనని కవిత మండిపడ్డారు. రూ. వేల కోట్ల ఎంవోయూలు చేసుకున్న కంపెనీలకు కనీసం వెబ్ సైట్ దిక్కులేదని కీలక వ్యాఖ్యలు చేశారు. వీటిపై తాను చేసిన రీసెర్చ్ లో చాలా కంపెనీల గుట్టు బయటపడిందన్నారు. హ్యాష్ ట్యాగ్ కాంగ్రెస్ ఫేక్ ఎంవోయూల పేరుతో తెలంగాణ యువత ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో అగ్నిప్రమాదాలు, నేరాలు పెరిగితే సీఎం ఏం చేస్తున్నట్లు? అని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని సీఎం రేవంత్ రెడ్డి 30 సార్లు ఢిల్లీకి వెళ్లి మోడీని కలిసినా రూ. 30 వేల కోట్లు తేలేదని నిలదీశారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి అభ్యర్థికి ఓటు వేయాలని కవిత పిలుపునిచ్చారు. జాగృతి తరఫున ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నామని ఈ నెల 20 తర్వాత జనంబాట కార్యక్రమం కొనసాగిస్తామన్నారు.

## కెసిఆర్‌పై విషం చిమ్ముతున్న రేవంత్

### సీఎం పై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

అమెరికా వెళ్లి హార్వర్డ్ లో నాలుగు రోజులు చదువుకున్నా.. రేవంత్ రెడ్డి తన వెనకటి గుణం మాత్రం మార్చుకోలేదని మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. కనీస సంస్కారంతో పాటు చిల్లర మాటల్లో, వెకిలి చేతల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ద్వేష రాజకీయాలకు, నరం లేని నాలుకతో విషం చిమ్మే కుసంస్కారానికి నిలువెత్తు నిదర్శనం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. దేశానికి గాంధీ జాతిపిత అయినట్లే, తెలంగాణను సాధించిన కేసీఆర్ కూడా జాతిపితే అన్నారు. సోమవారం రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రదానోత్సవంలో కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై హితబోధ చేసిన కొద్ది నిమిషాలు కూడా గడవకముందే.. అదే వేదికపై సీఎం రేవంత్ రెడ్డి తన అసలు స్వభావాన్ని, తన మాటల ద్వారానే బయటపెట్టుకున్నారని విమర్శించారు. హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ముగియకముందే, రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారన్నారు. కేసీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం పెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి తన అజీర్తిని, అక్కసును మరోసారి బయటపెట్టారని అన్నారు. హేట్ స్పీచ్ అంటే ఏమిటో చెప్పడానికి పుస్తకాలు అవసరం లేదు.. రేవంత్ రెడ్డి ప్రసంగాలు చాలు అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. నాలుగు కోట్ల ప్రజలు ఏకమై స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే ఆంధ్రా పాలకుల బూట్లు తుడుస్తున్న నీకు కేసీఆర్ గురించి, తెలంగాణ ఉద్యమం గురించి ఎలా తెలుస్తుంది? అని నిలదీశారు. ఉద్యమకారులపైకి తుపాకి ఎక్కుపెట్టిన నీకు ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు, ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు, కేసులతో నిరంకుశంగా వ్యవహరిస్తున్న నీకు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. అధికారాన్ని ప్రజల బాగు కోసం కాకుండా, ప్రతిపక్షాలపై రాజకీయ కక్షల కోసం వినియోగిస్తున్న నీకు అధికార దుర్వినియోగం గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. లక్కీ లాటరీలో సీఎం అయిన నీకు ఇవన్నీ ఎలా తెలుస్తాయి? ఎలా అర్థం అవుతాయి రేవంత్ రెడ్డి? అని విమర్శించారు. నువ్వు హార్వర్డ్ వెళ్ళినా, అంతరిక్షం వెళ్లినా నీ చెత్త బుద్ధి మారదు, నోటి మురికి పోదు అన్నది సుస్పష్టం అవుతోందని హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు.

### భావ ప్రకటనపై హైకోర్టు తీర్పును

## ధ్రువీకరించిన సుప్రీం

సోషల్ మీడియా పోస్టులపై కేసులు



నమోదు చేసే విషయంలో తెలంగాణ సర్కార్‌కు అత్యున్నత న్యాయస్థానంలో చుక్కెదురైంది. భావ ప్రకటన స్వేచ్ఛను నొక్కి చెబుతూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం కొట్టివేసింది. హైకోర్టు మార్గదర్శకాల్లో తప్పేమీ లేదని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే.. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త శశిధర్ గౌడ్ (నల్ల బాలు) సీఎం రేవంత్ రెడ్డి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనే ఆరోపణలతో పోలీసులు ఆయనపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దీనిపై శశిధర్ గౌడ్ గతంలో హైకోర్టును ఆశ్రయించగా, విచారణ జరిపిన న్యాయస్థానం ఆ ఎఫ్ఐఆర్‌లను కొట్టివేసింది. కేసు విచారణ సందర్భంగా హైకోర్టు పోలీసు యంత్రాంగానికి పలు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టులపై పోలీసులు కేసులు నమోదు చేయకూడదని చెప్పింది. ప్రతి చిన్న పోస్టుపై ఇష్టం వచ్చినట్లుగా కేసులు పెట్టడానికి వీల్లేదని స్పష్టం చేసింది. రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను గౌరవించాలని అక్షింతలు వేసింది. **సుప్రీంకోర్టులో పిటిషన్..** హైకోర్టు ఇచ్చిన ఈ మార్గదర్శకాలు తమకు ఇబ్బందికరంగా ఉన్నాయని, వీటిని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ సర్కారు ఇటీవలే సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ.. ఈ మార్గదర్శకాలు పోలీసుల విధులకు ఆటంకంగా మారుతాయని పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం హైకోర్టు తీర్పును తాము అభినందిస్తున్నామని పేర్కొంది. ఇలాంటి మార్గదర్శకాలు ఇవ్వడంలో తప్పేమీ లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ప్రభుత్వ పిటిషన్‌ను సోమవారం డిస్మిస్ చేస్తూ హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది.

# రాహుల్ వ్యాఖ్యలతో రాజుకున్న సభ

మొదటి పేజీ తరువాయి

రాహుల్ గాంధీ తన ఉపన్యాసంలో డోక్లాంను ప్రస్తావిస్తూ, భారత భూభాగంలోకి నాలుగు చైనా ట్యాంకులు ప్రవేశిస్తున్నాయి. వారు డోక్లామ్‌లో ఒక శిఖరాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. ట్యాంకులు కైలాష్ శ్రేణికి కొన్ని వందల మీటర్ల దూరంలోనే ఉన్నాయని, ఆర్మీ చీఫ్ రాశారని ప్రతిపక్ష నాయకుడు పేర్కొనడంతో, పార్లమెంటులోనూ, సోషల్ మీడియా వేదికలపైనా పెద్ద చర్చ రాజుకుంది. సోషల్ మీడియాలో ఒక వర్గం కాంగ్రెస్ నాయకుడు గల్వాంను ప్రస్తావిస్తున్నారా అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.
భారత్, చైనా, భూటాన్‌ల కూడలి అయిన డోక్లాం, 2017లో భారతదేశం, చైనా మధ్య ప్రతిష్టంభనకు వేదికగా నిలిచింది. అనంతరం 2020లో, తూర్పు లడాక్‌లోని గల్వాం, ఇరు పక్షాల మధ్య ఘోరమైన ఘర్షణకు స్థానమై, పరిస్థితి గంభీరం కావడంతో 20మంది భారతీయ సైనికులు మరణించారు.
పార్లమెంటులో రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు స్పందించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అతడు ప్రచురితం కాని పుస్తకం నుంచి ఉటంకించకూడదని, సభలో దానిని ప్రామాణీకరించమంటూ మధ్యలో జోక్యం చేసుకున్నారు.
దీనిపై మాట్లాడేందుకు అతడిని అనుమతించకూడదు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు తాను ఉటంకిస్తున్న పుస్తకాన్ని సభ ముందుంచాలని కోరుతున్నాను, ఎందుకంటే ఆయన ప్రస్తావిస్తున్న పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని సింగ్ అన్నారు. హోం మంత్రి అమిత్ షా కూడా మధ్యలో జోక్యం చేసుకుని, ఆ పుస్తకం ప్రచురితమైందా లేదా అని తెలుసుకోగోరారు. ఒకవేళ ఈ పుస్తకం ఇంకా ప్రచురితం కాకపోతే, ఈ సమాచారం అంతా మీకెలా తెలుసని ఆయన ప్రశ్నించారు.

> *లడాఖ ప్రతిష్ఠంభనపై మాజీ సైన్యాధ్యక్షుడు జనరల్ మనోజ్‌నరవాణె అప్రచురిత జ్ఞాపకాల ఆధారంగా రాసిన ఒక వ్యాసాన్ని రాహుల్ గాంధీ ఉటంకించడంతో లోక్‌సభలో తీవ్రవాగ్వాదం చోటు చేసుకుంది. అప్రచురిత పుస్తకాల నుంచి ఉటంకించడం నియమాలకు విరుద్ధమంటూ రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా అభ్యంతరం తెలిపారు. కాగా, రాహుల్ తన వ్యాఖ్యలను సమర్థించుకోవడం గందరగోళానికి దారి తీసింది.*

రాహుల్ గాంధీకి మద్దతుగా నిలుస్తూ, ఈ విషయం అత్యంత సున్నితమైనదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అన్నారు. లోహియా, నేతాజీ, జార్జ్ ఫెర్నాండెస్ సహా అందరూ చైనా గురించి హెచ్చరించారని, చైనాకు సంబంధించిన విషయం అత్యంత సున్నితమైందని అన్నారు. కనుక, ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు అనుమతించాలని ఆయన అన్నారు. తీవ్ర వాగ్వాదం జరుగుతున్న సమయంలో, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, స్పీకర్ ఆదేశాన్ని పాటించాలని రాహుల్‌ని కోరారు. సభలో గందరగోళం కొనసాగడంతో, ప్రతిపక్ష నాయకుడు కేవలం రాష్ట్రపతి ఉపన్యాసం గురించి మాట్లాడాలే తప్ప, ప్రచురితం కాని పుస్తకం నుంచి ఉటంకించకూడదని స్పీకర్ ఓం బిర్లా రూలింగ్ ఇచ్చారు. సమావేశంలో జరుగుతున్న చర్చకు సహేతుకం కాని విషయాలను పుస్తకం లేదా దినపత్రిక నుంచి ఉటంకించకూడదని, నియమాలను బిర్లా చదివి వినిపించారు. ప్రతిపక్ష నాయకుడిగా మీరు సభలో ఆరోపణలు చేస్తున్నారు, నియమాలను పాటించడం లేదు. ఇది సరైనది కాదు అని ఆయన అన్నారు. ఇందుకు, నేనేం మాట్లాడాలో దయచేసి మీరే చెప్పండి స్పీకర్ సర్ అంటూ రాహుల్ స్పందించారు. అందుకు ఓం బిర్లా, నేను మీకు సలహాదారును కాను, కానీ నియమాల ప్రకారం సభ జరిగేలా చూడటం స్పీకర్‌గా నా విధి, చర్చ కూడా లిస్ట్ అయిన విషయాంవానికే పరిమితం అంటూ సమాధానమిచ్చారు.
పదవిని అవమానించవద్దని, దాని తీర్పుకు వ్యతిరేకంగా వెళ్లవద్దని స్పీకర్ రాహుల్ గాంధీతో అన్నారు. సభాధ్యక్షుడు చేసిన నిర్ణయాలను అవమానించే హక్కు మీకు లేదు, మాట్లాడకూడదని మీరు నిర్ణయించుకుంటే, అది సరే అని బిర్లా అన్నారు. అనంతరం, తదుపరి వక్త అఖిలేష్ యాదవ్ అని, ఆయన రాష్ట్రపతి ఉపన్యాసంపై మాట్లాడతారని స్పకర్ ప్రకటించారు. గందరగోళం నడుమ స్పీకర్ మధ్యాహ్నం 3 గంటల వరకు సభను వాయిదా వేశారు.
బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తన ప్రసంగంలో యావత్ ప్రతిపక్షాన్ని, కాంగ్రెస్ పార్టీని 'దేశద్రోహులు' అని ముద్ర వేశారని, అందుకే తాను సభలో వాస్తవాలను స్పష్టం చేయాలనుకున్నానని తన రాహుల్ గాంధీ తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ అన్నారు. రక్షణమంత్రి, హోం మంత్రి, ప్రధానమంత్రి మా పార్టీ గురించి, మా నాయకుల గురించీ, మా జాతీయవాదం గురించి ప్రశ్నలు లేవనెత్తుతారు. ఈ వ్యాసం ప్రధానమంత్రి వ్యక్తిత్వాన్ని గురించి రాసింది, ఇది చైనా గురించి లేదా ప్రధాని గురించి కాదు అని ప్రతిపక్ష నాయకుడు అన్నారు.
ప్రతిపక్షాల వ్యక్తిత్వాన్ని గురించి లేదా వారి దేశభక్తి గురించి తేజస్వీ సూర్యం తన ఉపన్యాసంలో ఎటువంటి ప్రశ్నలు లేవనెత్తలేదంటూ షా ప్రతిస్పందించారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభమైన అనంతరం, రాహుల్ గాంధీ గల్వాం లోయ గురించి ప్రస్తావించారు. కాగా, రాష్ట్రపతి ఉపన్యాసానికి పరిమితం కమ్మని స్పీకర్ అన్నారు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన విషయమంటూ రాహుల్ గాంధీ సమాధానమిచ్చారు. స్పీకర్ సభను 4 గంటల వరకూ వాయిదా వేశారు.

## నేరం చేసి నీతులా?

మొదటి పేజీ తరువాయి



మరి ఇప్పుడు జాతిపిత అని చెప్పుకుంటున్న వాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులను ఏకం చేసి ఉద్యమాన్ని నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారుడు కాదా? అని నిలదీశారు. గతంలో తలుపులు బద్దలు కొట్టి ఆయన్ను అరెస్టు చేసింది మీ పాలనలో కాదా.. అప్పుడు ఉద్యమకారులు గుర్తుకురాలేదా? అని దుయ్యబట్టారు. పోలీసులు మిమ్మల్ని అలా తలుపులు బద్దలు కొట్టి తీసుకు రాలేదనే విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. కేవలం నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారన్నారు. రావి నారాయణ రెడ్డి లాంటి వారు తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని సీఎం చెప్పారు. అక్రమ మార్గం ఎంచుకున్న వారు ప్రజాస్వామ్యంలో విచారణ ఎదుర్కోవాల్సిందే అని అంబేద్కర్ చెప్పారనీ.. మరోవైపు శిబు సోరెన్ లాంటి వాళ్లూ విచారణ ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ దైవాంశ సంభూతుడేం కాదన్నారు. మధ్య యుగాల చక్రవర్తులు తమ బాధను రాజ్యం బాధగా ప్రచారం చేసేవారన్న సీఎం... ఇప్పుడా మధ్య యుగాల చక్రవర్తులకు కాలం చెల్లిందని చురకలంటిచారు. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించినప్పుడు అర్థం చేసుకోవాలన్న ఆయన హుందాగా వ్యవహరిస్తే కొంతైనా మీ గౌరవం నిలబడేదని కేసీఆర్ ను ఉద్దేశించి చెప్పారు. ప్రజలే తప్పు చేశారని చెప్పడం.. ఇదెక్కడి ప్రజాస్వామ్యం ? ఇదెక్కడి ఉద్యమకారుడి లక్షణం ? ఇదెక్కడి జాతిపిత లక్షణం? అన్నారు. కేసీఆర్ చేసిన తప్పులకే సిట్ అధికారులు ఆయనకు నోటీసులు ఇచ్చారని చెప్పారు. అయితే తాను ఎక్కడ ఉంటే అక్కడికే వచ్చి విచారణ చేయాలనడం కరెక్ట్ కాదన్న రేవంత్ రెడ్డి... అక్రమాలకు పాల్పడిన ఎవరైనా విచారణను ఎదుర్కోవాల్సిందే అన్నారు. వచ్చిన తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబ సభ్యులే పంచుకున్నారని సీఎం విమర్శించారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుందన్నారు. ఆ ప్రజా తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని రావి నారాయణరెడ్డి చాటిచెప్పారని సీఎం వ్యాఖ్యానించారు. దేశంలో అధిక మెజారిటీతో గెలిచిన ఎంపీగా రావి నారాయణ రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. ఆయన అన్ని పదవులను త్యాగం చేసిన గొప్ప నాయకుడన్నారు. కానీ ఈ రోజుల్లో ప్రజలు ఓడించినా పదవులు వదులుకునేందుకు ఇష్టపడటంలేదని కేసీఆర్ ను ఉద్దేశించి చెప్పారు. కేంద్రంలో అధికారంలో బీజేపీ రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కాలరాసేలా ఎస్ ఐ ఆర్ ను తీసుకువచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ కేంద్ర కుట్రపై కమ్యూనిస్టులు గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. బీజేపీ పాలనలో రాజ్యాంగంపై దాడి జరుగుతోందన్న సీఎం.. దీనిపై ప్రజల్లో చైతన్యం కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

## తెలంగాణకే తాడిచర్ల 1 గనులు

### రాజ్యసభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్ల-1 బొగ్గు గనుల కటాయింపుపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేసింది. తాడిచర్ల-1 బొగ్గు గనులను 2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థకు కేటాయించినట్లు వెల్లడించింది. తాడిచర్ల-1 బొగ్గు గనుల కేటాయింపులకు సంబంధించి.. కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ సోమవారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు.. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. 2019 మార్చి నెలలో బొగ్గు గనుల కేటాయింపులకు సంబంధించి నియమించిన ఉన్నత స్థాయి కమిటీ ఒక రిపోర్ట్ ఇచ్చినట్లు కేంద్రమంత్రి తెలిపారు. ఈ రిపోర్టుకు ఆమోదం తెలిపిన తర్వాత..2020 జూన్ నెల నుంచి దేశంలో బొగ్గు గనుల కేటాయింపుల ప్రక్రియ పూర్తిగా మారిపోయినట్లు వెల్లడించారు. వ్యాపార అవసరాలకు వినియోగించే గనులు అన్నింటినీ కేవలం వేలం ద్వారానే కేటాయించాలని ఉన్నత స్థాయి కమిటీ సూచనలు చేసినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. కొన్ని ప్రత్యేక, తప్పని పరిస్థితిల్లో మాత్రమే.. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నేరుగా.. బొగ్గు గనుల కేటాయింపు చేయాలని ఆ ఉన్నత స్థాయి కమిటీ స్పష్టంగా తేల్చి చెప్పినట్లు వివరించారు. అదే సమయంలో తాడిచర్ల-2 బొగ్గు గనులను ఇప్పటివరకు ఎవరికీ కేటాయింపు చేయలేదని ఆ లిఖిత పూర్వక సమాధానంలో వెల్లడించారు. మరోవైపు.. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను.. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయింపులు లేవని ఆరోపించారు. ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందని పేర్కొన్నారు.మరోవైపు.. 2020 జూన్ నెల నుంచి బొగ్గు వేలం ప్రక్రియలో ప్రభుత్వ రంగ సంస్థలకు బొగ్గు గనులను కేటాయించలేదని తమిళనాడుకు చెందిన ఎంపీ డాక్టర్ తంబిదురై తెలిపారు. ఈ గనుల వేలం ప్రక్రియలో రాష్ట్రాలకు ప్రాధాన్యతను ఇవ్వకుండా.. కేవలం ప్రైవేటు రంగ కొనుగోలుదారులకే కట్టబెడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. తెలంగాణ విద్యుత్ సంస్థకు తాడిచర్ల-1 బొగ్గు గనులను కేటాయించినట్లు వెల్లడించారు.

## ఎన్నికల తరువాత ఇంటి పన్ను పెంచుతారు

### కరీంనగర్ ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్

మున్సిపల్ ఎన్నికలు అయిపోగానే ఇంటిపన్ను పెంపునకు కాంగ్రెస్ ప్లాన్ చేస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. రెండేళ్లలో మున్సిపాలిటీలు, కరీంనగర్ కార్పొరేషన్‌కు నయాపైసా విడుదల చేయలేదని మండిపడ్డారు. కరీంనగర్ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్లే అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో లేని బీఆర్ఎస్‌కు ఓటు వేసి ఉపయోగం లేదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి, కబ్జాలతో దోచుకుతిన్నారని ఆరోపించారు. పొరపాటున బీఆర్ఎస్ గెలిస్తే.. కమీషన్ల కోసం కేంద్ర నిధులను దారి మళ్లిస్తుందని అన్నారు. కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధి మొత్తం కేంద్రం నిధులతోనే అని చెప్పారు. తాను పైసలు తీసుకొస్తే.. బీఆర్ఎస్ నేతలు సిగ్గు లేకుండా కొబ్బరికాయ కొట్టి మావేనని చెప్పుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే మరిన్ని నిధులు తెచ్చే బాధ్యత తనదన్నారు. గంగుల కమలాకర్ కు మూట ముల్లె సర్దుకుని కరీంనగర్ వదిలి వెళ్లిపోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

## న్యాయ నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలి

### రాజ్యసభలో ఎంపీ లక్ష్మణ్



దేశవ్యాప్తంగా న్యాయ నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ఐఏఎస్, ఐపీఎస్ తరహాలోనే అఖిల భారత న్యాయ సేవను వెంటనే ఏర్పాటు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన రాజ్యసభలో మాట్లాడారు. న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ప్రస్తుతం ఉన్న విధానంతో కొన్నిఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. దీని స్థానంలో ఓ జాతీయ స్థాయి వ్యవస్థను తీసుకురావాలని సూచించారు. యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షల మాదిరిగానే, న్యాయమూర్తుల ఎంపికకు కూడా ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఉండాలని వ్యాఖ్యానించారు. దీంతో ప్రతిభావంతులైన యువతకు న్యాయ వ్యవస్థలో సరైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అఖిల భారత న్యాయ సేవ ఏర్పాటుతో ఎస్సీ , ఎస్టీ , బీసీ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయ వ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని లక్ష్మణ్ అన్నారు.

## సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన

ఏ మార్పు కావాలని తెలంగాణ ప్రజలు ప్రజాప్రభుత్వంపై విశ్వాసం ఉంచారో రెండేళ్లలోనే ఆ మార్పు స్పష్టంగా చూపించి ప్రజల విశ్వాసాన్ని నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి అన్ని రంగాలలోనూ మరీ ముఖ్యంగా ఆర్థికరంగంలో పెను సంక్షోభం ఉందన్నారు. ఒక్కోమెట్టు పేర్చుకుంటూ సంక్షోభం నుంచి గట్టెక్కుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పునకు నాంది పలుకుతున్నాయని అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలుపుతున్నాయన్నారు. ఈ మార్పులను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకం. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకొని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆధునీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాలనను రెండేళ్లు పూర్తి చేసుకుని మూడో వసంతంలోకి అడుగుపెట్టామన్నారు. రెండేళ్ల కాలం మరీ తక్కువే కానీ ప్రభుత్వం సాధించిన విజయాలు మాత్రం అత్యద్భుతమన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వకపోయినా ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశామన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నామన్నారు. ఆర్థికవృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందనీ తెలంగాణను భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఒకవైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలను నిర్దేశించుకొని మరోవైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తూ, ద్విముఖ వ్యూహంతో మా ప్రభుత్వం పాలన సాగిస్తున్నామన్నారు. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ తెలంగాణను రెండేళ్లలో దేశానికి రోల్‌మోడల్‌గా నిలబెట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఅండ్ పిఆర్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సీఎం సీపీఆర్‌వో జి. మల్సూర్, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డిఎస్ జగన్ , జాయింట్ డైరెక్టర్ రమణ పాల్గొన్నారు.

## బిజెపి కోసం పనిచేస్తున్న ఇసి

మొదటి పేజీ తరువాయి

సమావేశం నుంచి బయటకు వచ్చిన తర్వాత, విలేకరులతో మాట్లాడుతూ, బెంగాల్‌లో సర్వసాధారణమైన చిన్న చిన్న స్పెల్లింగ్ తేడాలు, పేర్లలో మార్పుల కారణంగా ఓటర్ల దరఖాస్తులను రద్దు చేస్తున్నారని మమత ఆరోపించారు. వారు ముందుగా ప్రజల పేర్లను తొలగించారు. ఎన్నికల కమిషనర్ బీజేపీ ఐటీ సెల్ లాగా పనిచేస్తున్నారు. దీన్ని మీరు ప్రజాస్వామ్యం అంటారా? అని ఆమె ప్రశ్నించారు. బెనర్జీ , బంద్యోపాధ్యాయ, ముఖర్జీ, ముఖోపాధ్యాయ, లేదా చటర్జీ - చట్టోపాధ్యాయ వంటి స్పెల్లింగ్ తేడాల కారణంగా కూడా పేర్లను తొలగిస్తున్నారని బెనర్జీ అన్నారు. బెంగాల్‌లో ఇంటిపేర్లు మారుతాయి. ప్రజలు తమ బిరుదులను మార్చుకుంటారు. బిరుదులు మారడం వల్ల పేర్లను కుదించి రాస్తున్నారు, అని ఆమె అన్నారు. ఇలాంటి తేడాలను అసాధారణతలుగా గుర్తించి ఓటర్ల జాబితా నుండి పేర్లను తొలగిస్తున్నారని ఆమె తెలిపారు. ఎలాంటి విచారణ జరపకుండానే ఏకంగా 58 లక్షల మంది ఓటర్లను తొలగించారని ఆమె ఆరోపించారు. వారు వ్యక్తులను కనీసం అడగను కూడా లేదు, అని ఆమె అన్నారు. ఈ ప్రక్రియ సమయంలో బూత్ స్థాయి అధికారుల (బిఎల్ఒ)లపై ఒత్తిడి పెడుతున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఒత్తిడి అంతా బిఎల్ఓలపైనే ఉందని అన్నారు. షెడ్యూల్డ్ కులాలు, మైనారిటీలు అసమాన రీతిలో ప్రభావితమవుతున్నారని బెనర్జీ ఆరోపించారు. ఎస్సీలను, మైనారిటీలను ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారు? వారు మనుషులు కాదా? అని ఆమె ప్రశ్నించారు.

### బీజేపీ పాలిత అస్సాంలో ఎస్ఐఆర్ ఎందుకు లేదు?

ఈ సవరణ సమయాన్ని ప్రశ్నిస్తూ, ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఈ ప్రక్రియను ఎందుకు చేపడుతున్నారని బెనర్జీ ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఈ తొందర ఎందుకు? ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలను మీరు వదిలిపెట్టి ఉండాల్సింది, అని ఆమె అన్నారు. ఎన్నికల సంఘం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని కూడా ఆమె ఆరోపించారు. అస్సాంలో బీజేపీ ప్రభుత్వం ఉంది, అందుకే మీరు అక్కడ ఎస్ఐఆర్‌ను చేపట్టలేదు. మీరు బెంగాల్, కేరళ, తమిళనాడులను లక్ష్యంగా చేసుకుని, బీజేపీ పాలిత రాష్ట్రాన్ని వదిలేస్తున్నారు," అని ఆమె విమర్శించారు. ఇతర రాష్ట్రాలకు భూ రికార్డులు, మాధ్యమిక సర్టిఫికేట్ల వంటి పత్రాలను ఉపయోగించడానికి అనుమతి ఇచ్చినప్పటికీ, బెంగాల్ కోసం నిబంధనలను మార్చారని బెనర్జీ ఆరోపించారు. తన దాడిని తీవ్రతరం చేస్తూ, ఇది ఎన్నికల సంఘం కాదు. ఆయన ప్రధాన ఎన్నికల కమిషనర్ కాదు. ఇది ఒక బీజేపీ ఏజెంట్. కేవలం ఒక ఏజెంట్ అని ఆమె ఘాటుగా విమర్శలు చేశారు. అవమానించారు, శుద్ధ అబద్ధాలను మాకు అంటగట్టారు. తాను చివరికి సమావేశం నుండి బయటకు వచ్చానని బెనర్జీ అన్నారు. నేను సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చాను. ఈ ఎన్నికల కమిషనర్ చాలా అహంకారి. మాతో దురుసుగా ప్రవర్తించారు. మమ్మల్ని అవమానించారు, అని ఆమె ఆరోపించారు. న్యాయం కోసమే తమ ప్రతినిధి బృందం వచ్చిందని పేర్కొంటూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ మాకు అబద్ధాల చెత్తను అంటగట్టారు. మేము ఇక్కడ న్యాయం కోసం వస్తే, మాకు అన్యాయం జరిగింది అని బెనర్జీ విమర్శించారు. నకిలీ ఓటర్ల అంశాన్ని లేవనెత్తినందుకు తృణమూల్‌ను నిందించడం ద్వారా కమిషన్ ఎస్ఐఆర్‌ను సమర్థించిందని, పోల్ ప్యానెల్ సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘించిందని, ఈసీఐ దగ్గర మీడియా ప్రవేశాన్ని పరిమితం చేసిందని ఆమె ఆరోపించారు. నేను ఈ రకమైన ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ఎప్పుడూ చూడలేదు అని బెనర్జీ అన్నారు.

### ఎస్ ఐఆర్-బాధిత కుటుంబాలతో నిరసన

అంతకుముందు, బెనర్జీ, తృణమూల్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఎంపీ కళ్యాణ్ బెనర్జీలతో కలిసి, ఎస్ ఐఆర్ ప్రక్రియ ద్వారా ప్రభావితమైనట్లుగా చెప్తున్న 12 మంది కుటుంబ సభ్యులతో కలిసి సిఇసిని కలిశారు. ప్రతినిధి బృందం నిరసనగా నల్ల దుస్తులు ధరించింది. అధికారిక రికార్డులలో చనిపోయినట్లు ప్రకటించినా, బతికి ఉన్న వ్యక్తులు, సవరణ ప్రక్రియకు సంబంధించిన ఒత్తిడి కారణంగా మరణించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల బంధువులు వీరిలో ఉన్నారు. ఈ పర్యటన సందర్భంగా ఈసీఐ వెలుపల పోలీసు భద్రతను పెంచారు. పార్లమెంటులో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యలను బెనర్జీ కూడా ప్రతిధ్వనిస్తూ, కొనసాగుతున్న వివాదం కార్యకలాపాలకు అంతరాయం కలిగించిందని అన్నారు. బిజెపి అధికారంలో కొనసాగితేనే మీ కుర్చీ ఉంటుంది. ఈ రోజు మీరు మీ కుర్చీని కాపాడుకోవచ్చు, రేపు మీరు కాపాడుకోలేరు అని ఆమె అన్నారు.

## రెబెల్ గా పోటీ చేస్తే పార్టీ నుంచి సస్పెండ్

ఎవరైనా పార్టీ నిబంధనలు అతిక్రమించి మున్సిపల్ ఎన్నికల్లో రెబల్స్‌గా బరిలోకి దిగితే కనికరం లేకుండా పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుహెచ్చరించారు. నామినేషన్లు వేసిన ఇతర అభ్యర్థులు ఉపసంహరించుకోవాలని సూచించారు. పార్టీ బీఫామ్‌లు ఇచ్చిన అభ్యర్థులకు అందరూ సహకరించాల్సిందే అని తేల్చి చెప్పారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ శ్రేణులు, అనుబంధ సంఘాలన్నీ కలిసికట్టుగా పని చేయాలన్నారు. అత్యధిక పుర పీఠాలపై కాషాయ జెండా ఎగురవేసి.. ప్రధానమంత్రి నరేంద్రమోడీకి బహుమతిగా ఇద్దామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ బలపడుతుందనీ.. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ పాలన మనం చూద్దామన్నారు. ఈ క్రమంలో మూడేళ్ల కాంగ్రెస్ పాలనను అరాచక, అవినీతి పాలన అని అభివర్ణించారు. ఈ మేరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్లు ఇస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి నేటికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద రూ. వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని.. తద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. రాష్ట్రంలో ఏడు మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్స్‌ల పేరిట భారీ కుంభకోణం జరుగుతోందని రాంచందర్ రావు విమర్శించారు. ఇప్పటి వరకు రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తుచేశారు. రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానం గా మారా యన్న ఆయన పార్టీ అధ్యక్షుడు నిత్యం రోడ్డు ప్రమాదాలతో అనేక మంది మరణిస్తున్నారని ఆవే దన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నేరాలు విపరీతం గా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చే శారు. శాంతిభద్రతలు అదుపు తప్పాయన్నారు. తెలంగాణ డ్రగ్స్‌కు కేరాఫ్ గా మారిందని ఆరోపించారు.

## తెలంగాణకు యూనివర్సిటీ టౌన్‌షిప్

ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో తెలంగాణ విద్యారంగానికి పెద్దపీట వేసింది. రాష్ట్రానికి మరిన్ని కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాలను కేటాయించింది. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న ఐదు యూనివర్సిటీ టౌన్‌షిప్‌లలో ఒకటి తెలంగాణకు కేటాయించే అవకాశాలున్నాయి. ఈ బడ్జెట్‌లో కేంద్రం విద్యా రంగానికి కేటాయింపులు పెంచడంతో.. తెలంగాణకు వచ్చే నిధులు కూడా భారీగా పెరగనున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ సారి బడ్జెట్‌లో 6.22 శాతం అధికంగా కేటాయించడం విశేషం. తాజా బడ్జెట్‌లో హైదరాబాద్ నుంచి మూడు హైస్పీడ్ కారిడార్ రైళ్లను ప్రకటించిన కేంద్రం..... ఇందిరమ్మ ఇళ్లకు పీఎం ఆవాస్ యోజన కింద భారీగా నిధులు కేటాయించింది. వీటితో ఈ బడ్జెట్‌లో తెలంగాణ విద్యారంగానికి కూడా పెద్ద పీట వేసింది. రాష్ట్రానికి మరిన్ని కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాలను కేటాయించింది. కేంద్రం బడ్జెట్‌లో ఈ సంవత్సరానికి గాను విద్యా రంగం కేటాయింపులను భారీగా పెంచారు. ముఖ్యంగా రాష్ట్రంలోని కేంద్రీయ విద్యాయాలు(కేవీ), జవహర్ నవోదయ విద్యాలయాలు(జేఎన్‌వీ)ను మరింత అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 35 కేవీలు ఉన్నాయి. ఈ క్రమంలో ములుగు, జగిత్యాల, కొత్తగూడెం, వనపర్తి జిల్లాలకే కేంద్రం ఇటీవల కేవీలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 9 జవహర్ నవోదయ విద్యాలయాలు ఉన్నాయి.

# అంబటి రాంబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన చంద్రబాబు ఫ్యాన్స్ అసోసియేషన్

**– ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట నిరసన**



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 2 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తల్లి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్, స్కూల్ ఆఫ్ సీబీఎన్ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ప్రతీకాత్మక కార్యక్రమం చేపట్టి, ఇటువంటి నీచమైన మరియు బాధ్యతారహిత పదజాలం రాజకీయాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదని హెచ్చరించారు. కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్, స్కూల్ ఆఫ్ సీబీఎన్ అధ్యక్షుడు తలారి శ్రీనివాస రావు మాట్లాడుతూ, ప్రజలు వైసీపీని ఎన్నికల్లో ఘోరంగా తిరస్కరించినప్పటికీ ఆ పార్టీ నాయకులు ఇంకా అసభ్య వ్యాఖ్యలతో రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నారని విమర్శించారు. రాజకీయాల్లో విమర్శలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉండాలే తప్ప, మహిళలపై మరియు కుటుంబ సభ్యులపై అసభ్య పదజాలం ఉపయోగించడం తీవ్రంగా ఖండనీయమని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి వ్యాఖ్యలు చేసిన నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను ప్రజాస్వామ్యాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పి. వేణు, సైదులు, కళ్యాణ్, విష్ణు, మహేష్, నరేందర్, రాం, హరీష్, పవన్, రాజేష్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర భారత చైతన్య యువజన పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యులుగా --మేకల రాములు యాదవ్ ఎన్నిక

**– తెలంగాణలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా**

**– మేకల రాములు యాదవ్**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) పొలిటిక్స్ ఎఫైర్స్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన మేకల రాములు యాదవ్, ఈ సందర్భంగా రాములు యాదవ్ మాట్లాడుతూ (బీసీవై) తెలంగాణలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు, నాపై నమ్మకంతో పార్టీ కమిటీ సభ్యులుగా అవకాశం కల్పించిన జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ కి కృతజ్ఞతలు తెలుపుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీవై పార్టీ నిర్ణయించిన ప్రతి పిలుపును విజయవంతం చేస్తానని. గ్రామీణ ప్రాంతాల్లోని బీసీ కుల వృత్తులను, బీసీ సంఘాలను బీసీ యువజన సంఘాలను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తా అన్నారు

# హజ్రత్ గాలిబ్ షాహిద్ ఉర్సు ఉత్సవాలకు రాపర్తి సురేష్ గౌడ్ కు ప్రత్యేక ఆహ్వానం



రామంతపూర్ వార్త మిర్రర్ ప్రతినిధి సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ లో ప్రతి సంవత్సరం ఘనంగా జరిగే హజ్రత్ గాలిబ్ షాహిద్ ఉర్సు ఉత్సవాలకు హాజరుకావాలని, రామంతపూర్ లోని స్ఫూర్తి డిగ్రీ మహిళా కళాశాలలో స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ ను ఆహ్వానించారు. సురేష్ గౌడ్ ను ఘనంగా సన్మానించి, ఉర్సు ఉత్సవాల పోస్టర్ ను అందించారు మైనార్టీ నాయకులు ఎండి రహీం షరీఫ్, ఉర్సు ఉత్సవ కమిటీ నాయకులు

# బాధ్యతాయుత నిర్ణయంగా పదవికి రాజీనామా చేసిన కృష్ణ భీమ్



నవాబు పేట్ 02 వార్త మిర్రర్ వ్యక్తిగత పరిస్థితుల వల్ల బాధ్యతల నుంచి తప్పుకున్న కృష్ణ భీమ్ పూర్తి సమయం ఇవ్వలేక తీసుకున్న కీలక నిర్ణయం పదవి లేకపోయినా ఉద్యమంలోనే కొనసాగుతానని స్పష్టం ఫిబ్రవరి 2: నవాబుపేట మండలం వికారాబాద్ జిల్లా భీమ్ ఆర్మీ భారత్ ఏకతా మిషన్ యూత్ అధ్యక్షుడిగా సేవలందించిన నవాబుపేట మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన తలారి కృష్ణ తన పదవికి అధికారికంగా రాజీనామా చేశారు వ్యక్తిగత మరియు పరిస్థితిజన్య కారణాల వల్ల పూర్తి సమయాన్ని కేటాయించలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. అయితే, అంబేద్కర్ ఆశయాల కోసం తన ఉద్యమం మాత్రం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం పనిచేస్తున్న భీమ్ ఆర్మీ భారత్ ఏకతా మిషన్ వికారాబాద్ జిల్లా యూత్ అధ్యక్షుడిగా సేవలందించిన కృష్ణ భీమ్ తన పదవికి అధికారికంగా రాజీనామా చేశారు. తన రాజీనామా ఆయన వ్యక్తిగత, పరిస్థితిజన్య కారణాల వల్ల పూర్తి సమయాన్ని కేటాయించలేని పరిస్థితి ఏర్పడిందని వెల్లడించారు. అయితే, భీమ్ ఆర్మీ ఉద్యమం పట్ల తన నిబద్ధత యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. సంస్థలో సేవ చేయడం గర్వకారణం కృష్ణ భీమ్ మాట్లాడుతూ, డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు సమానత్వం, సామాజిక న్యాయం, విద్య హక్కు, స్వాభిమానం ఇవే తనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. జిల్లా యూత్ అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో గ్రామ, మండల స్థాయికి భీమ్ ఆర్మీ కార్యకలాపాలను విస్తరించేందుకు కృషి చేశానన్నారు. యువతను సంఘటితం చేసి సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడం, అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలపై స్పందించడం, ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు సమాచారం చేరవేయడం, విద్యా చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం వంటి అనేక కార్యక్రమాలలో భాగస్వామి అయినట్లు వివరించారు. సంస్థ నియమాలు బాధ్యతాయుత నిర్ణయం. " సంస్థకు నష్టం కలగకూడదు, బాధ్యతల నిర్వహణలో లోపం తలెత్తకూడదు అన్న ఉద్దేశంతోనే రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. పూర్తి స్థాయి సమయం ఇవ్వలేని పరిస్థితిలో పదవిలో కొనసాగడం కంటే బాధ్యతాయుత నిర్ణయం తీసుకోవడం సముచితమని భావించానన్నారు. రాష్ట్ర నాయకత్వం తన రాజీనామాను గౌరవప్రదంగా ఆమోదించి బాధ్యతల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. "చదువు సంఘటితం పోరాడు" సిద్ధాంతం ప్రభావం జిల్లా యూత్ అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో డా. బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితం, పోరాటాలు, ఆలోచనలు తనపై లోతైన ప్రభావం చూపాయని కృష్ణ భీమ్ తెలిపారు. అంబేద్కర్ బాల్యంలోనే సామాజిక వివక్షను ఎదుర్కొన్నప్పటికీ చదువును ఆయుధంగా మార్చుకుని ప్రపంచ స్థాయి పండితుడిగా ఎదిగి భారత రాజ్యాంగాన్ని రూపొందించిన ప్రధాన శిల్పిగా నిలిచారని గుర్తుచేశారు. దళిత, బహుజన, అణగారిన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, చట్టపరమైన రక్షణ వంటి హక్కులను కల్పించిన మహానుభావుడని అన్నారు. . సామాజిక చైతన్యంలో భీమ్ ఆర్మీ పాత్ర. భీమ్ ఆర్మీ కేవలం ఒక సంస్థ కాదు, సామాజిక చైతన్యానికి ఒక వేదిక అని కృష్ణ భీమ్ అభిప్రాయపడ్డారు. విద్యపై అవగాహన, యువతలో నాయకత్వ లక్షణాల పెంపు, సామాజిక అన్యాయాలపై స్పందన, రాజ్యాంగ విలువల ప్రచారం ఇవన్నీ భీమ్ ఆర్మీ ప్రధాన లక్ష్యాలన్నారు. మహనీయుల స్ఫూర్తి పోరాట పథం. తన ప్రయాణంలో అనేక మహనీయుల జీవితం తనను ప్రభావితం చేసిందని ఆయన పేర్కొన్నారు: మహాత్మా జ్యోతిరావు పూలే కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి శుద్ర అతిశుద్రులకు విద్య హక్కు సాధించారు. సావిత్రిబాయి పూలే బాలికల విద్య కోసం జీవితాన్ని అంకితం చేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు. మాతా రమాబాయి అంబేద్కర్ బాబాసాహెబ్ పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచిన మహోన్నత మహిళ. ఛత్రపతి శివాజీ మహారాజ్ స్వరాజ్యం, స్వాభిమానం, ప్రజా పరిరక్షణకు ప్రతీక. వారి జీవితం ఒకే సందేశాన్ని ఇస్తుందని, విద్యే విముక్తి సంఘటనే శక్తి పోరాటమే మార్పు అని అన్నారు. కార్యకర్తలకు కృతజ్ఞతలు తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా మండల గ్రామ స్థాయి నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భీమ్ ఆర్మీ వికారాబాద్ జిల్లా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తు లక్ష్యం పదవి నుంచి తప్పుకున్నప్పటికీ, సామాజిక ఉద్యమాలలో సాధారణ కార్యకర్తగా పనిచేస్తానని స్పష్టం చేశారు. అంబేద్కర్ ఆశయాలు గ్రామ స్థాయికి చేరేవరకు తన ప్రయాణం ఆగదని తెలిపారు.. ఉద్యమం కొనసాగుతుంది .. కృష్ణ భీమ్ రాజీనామా సంస్థలో ఒక పరిపాలనా మార్పు మాత్రమేనని, ఉద్యమం మాత్రం మరింత విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని కార్యకర్తలు భావిస్తున్నారు. భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ పాత్ర. భీమ్ ఆర్మీ స్థాపకుడు, జాతీయ నాయకుడు, ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని నగీనా లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ దేశవ్యాప్తంగా దళిత, బహుజన, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటం సాగిస్తున్నారని కృష్ణ భీమ్ గుర్తుచేశారు. చంద్రశేఖర్ ఆజాద్ నాయకత్వంలో భీమ్ ఆర్మీ విద్య, చట్టపరమైన సహాయం, సామాజిక రక్షణ, రాజ్యాంగ విలువల ప్రచారం వంటి రంగాల్లో దేశవ్యాప్తంగా సేవలు అందిస్తోందన్నారు. యువతలో చైతన్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. చంద్రశేఖర్ ఆజాద్ రావణ్ సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న జాతీయ నాయకుడు భారతదేశంలో దళిత, బహుజన, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం బహిరంగంగా, నిరంతరం పోరాటం కొనసాగిస్తున్న నాయకుల్లో ప్రముఖుడు చంద్రశేఖర్ ఆజాద్ రావణ్. ఆయన పేరు వినగానే యువత, సామాజిక ఉద్యమాలు, రాజ్యాంగ హక్కుల కోసం జరిగే నిరసనలు గుర్తుకు వస్తాయి. ప్రారంభ జీవితం. చంద్రశేఖర్ ఆజాద్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన చిన్నప్పటి నుంచే సామాజిక అసమానతలను గమనించారు. చదువు ద్వారా చైతన్యం పెంపొందించుకోవాలని భావించి ఉన్నత విద్యను అభ్యసించారు. డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలు, రాజ్యాంగ విలువలు ఆయన ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేశాయి. భీమ్ ఆర్మీ స్థాపన. 2015లో ఆయన భీమ్ ఆర్మీ భారత్ ఏకతా మిషన్ అనే సామాజిక సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ముఖ్య ఉద్దేశాలు: అణగారిన వర్గాలపై జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా నిలబడటం, విద్యపై అవగాహన కల్పించడం, రాజ్యాంగ హక్కులపై చైతన్యం, సామాజిక ఐక్యత, స్వాభిమానం పెంపొందించడం. భీమ్ ఆర్మీ గ్రామ స్థాయి వరకు విద్యా కేంద్రాలు, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో సామాజిక బాధ్యతను పెంచే ప్రయత్నం చేసింది. . సామాజిక ఉద్యమాల్లో పాత్ర. దేశంలో ఎక్కడైనా కుల వివక్ష, సామాజిక అన్యాయం, దళితులపై దాడులు జరిగినప్పుడు చంద్రశేఖర్ ఆజాద్ స్పందిస్తూ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తారు. ఆయన నేతృత్వంలో అనేక నిరసనలు, ర్యాలీలు, చట్టపరమైన పోరాటాలు జరిగాయి. అనేక సందర్భాల్లో అరెస్టులు, కేసులు ఎదుర్కొన్నప్పటికీ తన పోరాట ధోరణిని కొనసాగించారు. దీనివల్ల ఆయన యువతలో ఒక ప్రతిఘటన చిహ్నంగా గుర్తింపు పొందారు. రాజకీయ ప్రవేశం సామాజిక ఉద్యమాల తర్వాత ఆయన రాజకీయ రంగంలోకి ప్రవేశించి . ఆజాద్ సమాజ్ పార్టీ కాంశీరాం ను స్థాపించారు. రాజకీయ వేదిక ద్వారా రాజ్యాంగ విలువలు, సమానత్వం, సామాజిక న్యాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2024లో ఉత్తరప్రదేశ్‌లోని నగీనా లోక్‌సభ నియోజకవర్గం నుండి ఎంపీగా ఎన్నికయ్యారు. పార్లమెంట్ వేదికగా అణగారిన వర్గాల సమస్యలను ప్రస్తావించాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నారు. ఆలోచనా దృక్పథం చంద్రశేఖర్ ఆజాద్ తరచూ ప్రస్తావించే అంశాలు: విద్యే విముక్తికి మార్గం, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక సమానత్వం, యువతలో చైతన్యం, అంబేద్కర్, పూలే, పెరియార్ వంటి సామాజిక సంస్కర్తల స్ఫూర్తి. ఆయన ప్రసంగాలలో రాజ్యాంగ హక్కుల ప్రాముఖ్యత, స్వాభిమానం, సంఘటిత పోరాటం ప్రధానంగా వినిపిస్తాయి. యువతపై ప్రభావం చంద్రశేఖర్ ఆజాద్‌ను అనేక మంది యువకులు ఒక ఉద్యమ నాయకుడిగా చూస్తారు. విద్య, స్వాభిమానం, సామాజిక చైతన్యం గురించి ఆయన ఇచ్చే సందేశాలు గ్రామ స్థాయి వరకు చేరాయి. సోషల్ మీడియా ద్వారా కూడా ఆయనకు విశేషమైన ఫాలోయింగ్ ఉంది. మొత్తం దృష్టిలో చంద్రశేఖర్ ఆజాద్ రావణ్ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, సామాజిక ఉద్యమాల నుంచి వచ్చిన నేతగా గుర్తింపు పొందారు. ఆయన ప్రయాణం గ్రామ స్థాయి చైతన్యం నుంచి పార్లమెంట్ వరకు సామాజిక న్యాయం కోసం సాగుతున్న పోరాటానికి ప్రతీకగా భావించబడుతోంది. అని కృష్ణ భీమ్ అన్నారు

# చెందిప్ప గ్రామంలోని మరకత శివాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



శంకర్ పల్లి 02 వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని చెందిప్ప గ్రామంలో ఉన్న ప్రసిద్ధ మరకత శివాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య 60 కుటుంబాలు (దంపతులు)సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై, వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో సత్యనారాయణ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వ్రత అనంతరం మహా ప్రసాద వితరణ చేపట్టగా, భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో ఐక్యత, శాంతి, సుఖసమృద్ధులను తీసుకువస్తాయని తెలిపారు. సామూహిక వ్రతాల నిర్వహణలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ నుండి

# బిజెపిలోకి భారీగా చేరికలు

**–కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజలకు విశ్వాసం లేదు**

**– శ్రీరాములు అందెల**



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 2 : మహేశ్వరం నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బలం రోజు రోజుకీ పెరుగుతోందని, కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పార్టీలపై ప్రజలు పూర్తిగా నమ్మకం కోల్పోయారని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్, ప్రశాంత్ హిల్స్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్ నరేందర్ కుమార్ తో పాటు 500 మంది కాంగ్రెస్ నాయకులు మరియు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శంకర్ నాయక్ తో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు సోమవారం మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో బీజేపీ అధ్యక్షులు బిక్షపతి చారి, ముఖేష్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు సమక్షంలో బీజేపీ లో చేరారు. ఈ సందర్భంగా శ్రీరాములు వారికి పార్టీ కండువా కప్పి ఘనంగా పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, అలాగే మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధిలో స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని తీవ్రస్థాయిలో విమర్శించారు. నియోజకవర్గంలో ఏ కాలనీకి వెళ్లినా డ్రైనేజీ సమస్యలు, రోడ్ల దుస్థితి స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. కనీస మౌలిక వసతులు కూడా లేని పరిస్థితి నెలకొందని, నియోజకవర్గ ప్రజలు నరకం అనుభవిస్తున్నారని మండిపడ్డారు. మహేశ్వరం నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలన్నింటిని గాలికి వదిలేసి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి గారు రాజేంద్రనగర్ మరియు చేవెళ్ల నియోజకవర్గాల్లో రాజకీయాలు చేయడంలో బిజీగా ఉన్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. తమ నియోజకవర్గ ప్రజల బాధలు పట్టించుకోకుండా ఇతర ప్రాంతాల్లో రాజకీయ ప్రయోజనాల కోసం తిరగడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలను గాలికొదిలి స్వప్రయోజన రాజకీయాలు చేస్తున్న పార్టీలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అభివృద్ధి జరుగుతుండగా, అదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు ముందుకు వస్తున్నారని శ్రీరాములు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, బిజెపి ప్రధాన కార్యదర్శులు, మాజీ కార్పొరేటర్లు, బిజెపి సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

# చీకటి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీరాములు అందెల

**– ఎడ్ల బండ్ల పోటీలను ప్రారంభించిన శ్రీరాములు అందెల**



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 2 : మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలోని పులిమామిడి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన స్వయంభు శ్రీ చీకటి వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పులిమామిడి గ్రామ సర్పంచ్ ఎంబడి రమేష్ తన పాలకవర్గంతో కలిసి శ్రీరాములు ని ఘనంగా స్వాగతించి సత్కరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎడ్లబండ్ల పోటీలను శ్రీరాములు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ గ్రామీణ సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణలో ఇలాంటి పండుగలు, ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. స్వయంభు శ్రీ చీకటి వెంకటేశ్వర స్వామి వారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో, సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ పాప్పగల్ల రాములు, వార్డు సభ్యులు అనురాధ, రవి, వెంకటయ్య, మల్లేష్, అంజయ్య యాదవ్, మల్లేష్ యాదవ్, ప్రవీణ్, సాయి, బూత్ అధ్యక్షులు బండ నగేష్, మహేష్, బిజెపి సీనియర్ నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాయికల్ మున్సిపాలిటీలో

# 6 వార్డుల్లో జనసేన పోటీ



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 2 జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపాలిటీలోని ఆరు వార్డుల్లో జనసేన పార్టీ పోటీకి సిద్ధమైందనీ, పవన్ కల్యాణ్ సిద్ధాంతాలకు అనుగుణంగా అభ్యర్థులకు బి--ఫామ్‌లు అందజేస్తున్నామని జనసేన పార్టీ జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ బెక్కం జనార్ధన్ అన్నారు. రాయికల్ మున్సిపల్ మూడో వార్డు నుండి చౌహాన్ శ్రీనివాస్, ఐదో వార్డు నుండి కాశవేణి హేమలత, ఎనిమిదో వార్డు నుండి మ్యాకల జనార్ధన్,11వ వార్డు నుండి పాలెపు బాలరాజు,12వ వార్డు నుండి ఆడెపు అర్జున్ జనసేన తరఫున పోటీ చేయనున్నారు. జనసేన పార్టీ జగిత్యాల జిల్లా ఇంచార్జ్ బేక్కం జనార్ధన్ అభ్యర్థులకు బి--ఫారమ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా గతంలో నిర్వహించిన పాదయాత్రను వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాయికల్ జగిత్యాల కోఆర్డినేటర్ బొల్లి రాము, గట్ల శ్రీకర్, మొగిలోజి విజయ, రాయికల్ ఇంచార్జ్ బత్తిని బాబు, జైపాల్ రెడ్డి, తోకల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ "భీమన్న" ఆలయానికీ ఆర్థిక చేయూతనిద్దాం!




వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 2 జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న భీమన్న ఆలయం ప్రత్యేకతను సంతరించుకుంది ప్రజలు ఆలయంలో ప్రతియోటా ఫిబ్రవరి నెలలో వచ్చే పౌర్ణమికి ప్రారంభం అయి మూడు రోజులు జరిగే భీమన్న జాతరకు చుట్టూ పక్కల జగిత్యాల,మెట్ పల్లి, కోరుట్ల,మల్లాపూర్ ఖానాపూర్, ఇతర జిల్లా కేంద్రాలు అయినా నిజామాబాద్ ,కరీంనగర్ ఆదిలాబాద్ వేలాదిగా ప్రజలు వచ్చి స్వామివారికి మొ క్కులు చెల్లించుకుంటారు. మూడవ తేదీనాడు ఘనంగా స్వామివారి రథోత్సవం జరుగనున్నది. భీమన్న ఆలయ అభివృద్ధి రీత్యా ఆర్థిక సహాయం అందించాలని భక్తులకు ఆలయ నిర్వాహకులు దేవుని లింగయ్య విజ్ఞప్తి చేశారు. ఆలయం రోడ్డుకు ఇరువైపులా కమాన్ లు, ఆలయం చుట్టూ సిసి స్లాబ్ వేయుటకు ఆర్థిక సహాయం చేయుటకు జి పే /ఫోన్ పే నెంబర్ 9441725016,9908645621 సంప్రదించండి.

# శవ రాజకీయాలకు జీవం పోస్తున్న లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి

- మాజీ మున్సిపల్ చైర్మన్ దివంగత ఆకుల రమేష్ గౌడ్ పేరును బైరామల్ గూడ ఫ్లైఓవర్కు పెట్టాలి
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్



ఎల్బీనగర్ 2 ఫిబ్రవరి ఎల్బీనగర్ నియోజకవర్గంలోని అవిభాజ్య కర్మన్ ఘట్ డివిజన్ నుండి లింగోజిగూడ డివిజన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలంగాణ రాజ్యాధికార పార్టి ఆఫిసియల్ స్పోక్స్ పర్సన్ బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు. లింగోజిగూడ డివిజన్ కు జరిగిన కార్పొరేటర్ ఎన్నికలలో మాజీ ఎల్బీనగర్ మున్సిపల్ చైర్మన్ దివంగత ఆకుల రమేష్ గౌడ్ కార్పొరేటర్ గా విజయం సాధించారని గుర్తు చేశారు. ఆయన ప్రమాణ స్వీకారం చేయకుండానే కరోనా సమయంలో ఆరోగ్యం సహకరించక అకాల మరణం చెందారు. ఆయన మరణంతో డివిజన్ ఖాళీ కావడంతో ఆయన దశదినకర్మ రోజున ఈ డివిజన్ కు ఉప ఎన్నిక గనుక వస్తే ఇక్కడ ఎవరిని పోటీలో పెట్టొద్దని, వారి కుటుంబశీ నుండి ఒకరికి అవకాశం ఇచ్చి ఏకగ్రీవంగా ఎన్నుకుందామని అందులో నేనే మొదటి సంతకం చేస్తానని ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి అప్పట్లో ప్రకటించారని వెంకటేష్ గౌడ్ వెల్లడించారు. కానీ మాట మార్చి వక్రబుద్ధితో నాకు వచ్చిన అవకాశాన్ని ఎందుకు వదులుకుంటానని చెప్పి టీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో కుమ్మక్కై ఇక్కడ మీరు అభ్యర్థిని పెట్టొద్దని, నాకు ఎన్నికలలో సహకరించాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి వేడుకున్నట్లు ఆరోపించారు. సుధీర్ రెడ్డి కేటీఆర్ తో మాట్లాడి లింగోజిగూడ డివిజన్ కు జరిగే ఉప ఎన్నికలలో అభ్యర్థిని పెట్టకుండానే ధర్పల్లి రాజశేఖర్ రెడ్డికి బయట నుండి మద్దతు ఇచ్చి ఆయన గెలుపులో భాగస్వామ్యం అయ్యారని చెప్పారు. సీనియర్ నాయకులు దివంగత ఆకుల రమేష్ గౌడ్ కుమారుడు ఆకుల అఖిల్ గౌడ్ బిజెపి పార్టీ అభ్యర్థిగా బరిలో నిలబడితే అది చూసి ఓర్వలేని ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి ఎలాగైనా ఓడగొట్టాలని సుధీర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి ఇద్దరు చేతులు కలిపి అఖిల్ గౌడ్ ను ఓడించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి 2023న జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఒక బీసి బిడ్డ మధు యాష్కిగౌడ్ ను కూడా దగ్గరుండి ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి ఓడ కొట్టాడని ఆరోపించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం లో బీసీలు అంటే గిట్టదని, బీసీ నాయకత్వము బలపడుతుంటే అగ్రకుల నాయకులు ఓర్చుకోవడం లేదని వెంకటేష్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకోసమే కావాలని బైరామల్ గూడ ఫ్లైఓవర్కు ఆకుల రమేష్ గౌడు పేరు పెడితే బీసీలు రాజకీయంగా సంఘటితమవుతారని, దివంగత వంగ మధుసూదన్ రెడ్డి పేరు పెట్టాలని జిహెచ్ఎంసి లో లెటర్ పెట్టారని, నీ పార్టీ వేరు ఆయన పార్టీ వేరు అయినప్పటికీ నీకులం ఆస్తిత్వం కాపాడటం కోసం ఇంత దిగజారుతావా అని వెంకటేష్ గౌడ్ దుయ్యబాట్టారు. ఇది నీ రాజకీయ జీవిత సమాధికి పరాకాష్ట అని ఆరోదించారు.

## జెఫ్రి ఎఫ్ స్టీన్ ఫైల్స్ పై
# మోడీ మౌనం వీడాలి

**-రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి**
**- యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం**



ఎల్బీనగర్ 2 ఫిబ్రవరి అమెరికా మానవ అక్రమ రవాణా కర్త బాలికల లైంగిక అపరాధి, అత్యంత వికృతమైన మనుషుల్లో ఒకడు నేరస్తుడు, రేపిస్ట్ జెఫ్రి ఎఫ్ స్టీన్ తో ప్రధాని మోడీ సన్నిహితంగా సౌకర్యంగా ఉండటం సిగ్గు చేటు అంటూ ఎల్ బి నగర్ చౌరస్తాలో ప్రధాన మంత్రి మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ జెఫ్రి ఎఫ్ స్టీన్ లాంటి అంతర్జాతీయ నేరస్తుడి డాక్యుమెంట్లలో భారత ప్రధాని పేరు రావడం దేశ ప్రతిష్టతకు అవమానకరం అన్నారు. ఈ అంశం పై ప్రధాన మంత్రి మౌనం వీడి తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాడ్ చేశారు. దేశ ప్రతిష్టతను ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన ప్రధానమంత్రి అంతర్జాతీయ నేరస్తులతో సన్నిహితంగా సౌకర్యంగా ఉండటం ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కాడని ఆరోపించారు. చిన్న ఆరోపణలకే ప్రతిపక్ష నేతలపై ఈ.డి, సి.బి.ఐ,ఐ.టి శాఖలను ప్రయోగించే ప్రభుత్వం ఎందుకు మోడీపై విచారణ జరపట్లేరని కేంద్ర ప్రభుత్వ సంస్థలపై ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కిడి సత్య తేజ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శాం చరణ్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, కర్మాన్ ఘాట్ హనుమాన్ టెంపుల్ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, సామిడి చరణ్ రెడ్డి, నియోజకవర్గం అధ్యక్షులు శివ కుమార్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు సికిందర్ రెడ్డి పలు డివిజన్ ల అధ్యక్షులు మరియు యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యం: మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 2 : చేవెళ్ల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ తన గెలుపు వ్యూహాన్ని వేగవంతం చేసింది. సోమవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలో అట్లాస్ ఫంక్షన్ హాల్ లో చేవెళ్ల మున్సిపాలిటీకి సంబంధించి పార్టీ ఖరారు చేసిన అభ్యర్థులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రా రెడ్డి, కార్తీక్ రెడ్డి అధికారికంగా బి-ఫామ్ ను అందజేశారు. బి-ఫామ్లు అందుకున్న అభ్యర్థులు తమపై నమ్మకం ఉంచినందుకు పార్టీ నాయకత్వానికి సబితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సబిత ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... అభివృద్దే మా మంత్రం గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులే మన అభ్యర్థులను గెలిపిస్తాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ల ప్రాంత సమగ్ర అభివృద్ధి కేవలం బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి, పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి రెడ్డి, మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, దేశమళ్ళ ఆంజనేయులు, హన్మంతు రెడ్డి,కరుణాకర్ రెడ్డి, మల్ల రెడ్డి, రాం ప్రసాద్, బ్యాగరి సుదర్శన్, ఉపేందర్ రవి కుమార్,ఆసిఫ్ ,పృథ్వి, రాఘవేందర్ రెడ్డి, తలారి శ్రీనివాస్,తదితర నాయకులు, స్థానిక బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## నాయకురాలుగా కాదు..
# సేవకురాలిగా పని చేస్తా

**- గుమ్మల సరిత మల్లేశం**
**- ప్రజా సేవే లక్ష్యంగా 28వ వార్డు కౌన్సిలర్ గా మీ ముందున్న ఆశీర్వదించండి.!**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి భువనగిరి మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో 28వ వార్డు కౌన్సిలర్ గా పైళ్ళ శేఖర్ రెడ్డి ఆశీస్సులతో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన, గుమ్మల సరిత మల్లేశం కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని 28వ వార్డులో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు, గుమ్మల సరిత మాట్లాడుతూ 28వ వార్డులో నెలకొన్న మౌలికమైన సమస్యలకు పరిష్కారం చూస్తానని అన్నారు, ప్రజల భాగస్వామ్యంతో పరిష్కార దిశగా పనిచేస్తానని, ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు ఇంటింటి ప్రచారంలో బిఆర్ఎస్ నాయకులు, మైనార్టీ మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు



## మున్సిపల్ ఎన్నికల ఖర్చులపై నిశిత నిఘా

హనుమకొండ, ఫిబ్రవరి 2 : మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లపై అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం సోమవారం జరిగింది. మంగళవారం ఉపసంహరణలకు చివరి తేదీ. నేడు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. పోలింగ్ తేదీ ఈనెల 11న(మంగళవారం) నుంచి ఎన్నికల ప్రచారంపై అభ్యర్దులు చేసే ఖర్చు లెక్కింపు అధికారికంగా అమలులోకి వస్తుంది. ఎన్నికల ప్రచారానికి గడువు వారం రోజులే. అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఖర్చు పరిమితి, ఎన్నికల అధికారుల లెక్కింపు ఎలా ఉంటుందో చూద్దాం. పార్టీ అభ్యర్థి అయినా, స్వతంత్ర అభ్యర్థి అయినా ఇద్దరికీ ఖర్చు పరిమితి ఒకేలా ఉంటుంది. నగర పంచాయతీలకు రూ.2లక్షలు, గ్రేడ్3 మున్సిపాలిటీలకు రూ.3లక్షల వరకు, గ్రేడ్ 2 మున్సిపాలిటీలకు రూ.4లక్షల వరకు, గ్రేడ్1 మున్సిపాలిటీలకు రూ.5లక్షల వరకు అభ్యర్థులు ఖర్చు చేయవచ్చు. ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాహనాల అద్దె, మైక్ లేదా డీజే, సభలు, సమావేశాల నిర్వహణ, సో షల్ మీడియా ప్రచారం, కార్యకర్తలకు భోజనాలు, తాగునీరుపై పెట్టిన వ్యయాలన్నిటినీ ఎన్నికల ఖర్చు కిందే లెక్కిస్తారు. పార్టీ చేసిన ఖర్చు కూడా అభ్యర్థి ఖర్చుగానే పరిగణిస్తారు. ప్రతీ అభ్యర్థి తప్పనిసరిగా ఎన్నికల ఖర్చుల రిజిస్టర్ నిర్వహించాలి. ఎన్నికల అధికారికి మధ్యలో, ఎన్నికల తర్వాత 30 రోజులలోపు రిజిస్టర్ తప్పక చూపించాలి.

# మన ప్రాంత అభివృద్ధికై కదలిరండి...

**- ఆదరణ పొందుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కల్లెట్ల చంద్రకళ మారయ్య సగర**
**- కౌన్సిలర్ గా అవకాశం కల్పించండి**
**- అభివృద్ధి నా బాధ్యత - కల్లెట్ల చంద్రకళ మారయ్య సగర**

చండూరు వార్త మిర్రర్ ప్రతినిధి చండూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా 1.వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కల్లెట్ల చంద్రకళ మారయ్య సగర గెలుపుకై ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ ప్రజలు కల్లెట్ల చంద్రకళ మారయ్య సగర మాట్లాడుతూ తనకు కౌన్సిలర్ అభ్యర్థిగా ఒక్కసారి అవకాశం కల్పించి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో కాలనీ వాసులతో తమ ఆలోచనలను పంచుకున్నారు. చెయ్యి గుర్తుకు ఓటు వేసి అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా కాలనీవాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సంక్షేమ ఫలాలు అర్హులైన పేద ప్రజలకు అందిస్తానన్నారు. కాలనీ అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని ప్రజలను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని నిర్వహించారు





## చింతలూరులో దేవాలయ చైర్మన్, వీడీసి చైర్మన్ ల ఏకగ్రీవ ఎన్నిక



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 2 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం చింతలూర్ గ్రామంలో గుడి ఆవరణ లో ప్రజా సమక్షంలో సర్పంచ్ భానోత్ వనిత రమేష్ అధ్యక్షతన శ్రీ మక్కల సాయికుమార్ ని వేణుగోపాలస్వామి దేవాలయ చైర్మన్ గా, కడ రాజేందర్ ను వీడీసీ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది...ఎన్నికైన చైర్మన్ లను శాలువాలతో సత్కరించి అభినందించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లపు నరసయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, అల్లాల అంజిత్ బాబురావు, జనార్దన్, జాటోత్ రెడ్డి, లచ్చన్న, భూమారావు, సుధాకర్, సత్యం, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ జోనల్ కమిషనర్ ను కలిసిన బడంగ్పేట్ బీజేపీ నాయకులు



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 2 : బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో గత పాలకవర్గం తీర్మానాలు చేసినటువంటి పనులను తొందరగా పూర్తి చేయాలని సోమవారంశంషాబాద్ జోనల్ కమిషనర్ ను కలిసిన బడంగ్పేట్ బీజేపీ అధ్యక్షులు మరియు మాజీ కార్పొరేటర్లు కమిషనర్ కి వివరించడం జరిగింది. అల్మాస్గూడ కోమటికుంట చెరువు నుండి పెద్ద చెరువు వరకు ఎస్ ఎన్ డి పి నాలను పూర్తి చేసి చెరువులో డ్రైనేజీ కలవకుండా చూడాలని, టెండర్ పూర్తి అయిన పనులను కాంట్రాక్టర్లతో మాట్లాడి తొందరగా పనులు పూర్తి చేయాలని అదేవిధంగా జిహెచ్ఎంసి డివిజన్లు 57 నాదర్ గుల్ 61 బడంగ్ పేట్ 62 బాలాపూర్ డివిజన్ల లోనీ కొత్తగా ఏర్పడుతున్న కాలనీలలో నిన్న జిహెచ్ఎంసి లో కేటాయించిన బడ్జెట్ తో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు మరియు విద్యుత్ లైట్లు కొత్తగా ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తోట శ్రీధర్ రెడ్డి గూడెపు ఇంద్రసేన గడ్డం లక్ష్మారెడ్డి దడిగ శంకర్ వీర కర్ణ రెడ్డి శ్రీనివాస్ ప్రభాకర్ శ్రీశైలం చారి తదితరులు పాల్గొన్నారు

## బాలరాజు పార్థివ దేహంపై పూలమాలవేసి నివాళులర్పించి..సబితా ఇంద్రా రెడ్డి




వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 2 : మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కీర్తిశేషులు కూన బాలరాజు అకాల మరణం వార్త తెలుసుకున్న మాజీ మంత్రి మహేశ్వరం నియోజవర్గం శాసన సభ్యురాలు సబితా ఇంద్రా రెడ్డి మహేశ్వరం గ్రామం చేరుకుని బాలరాజు పార్థివ దేహం పై పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు..

## కొత్త వాటర్ పైపు లైన్ కోసం పాత వాటర్ లైన్లు రిపేర్లు



ఆమనగల్ వార్త మిర్రర్ ఫిబ్రవరి 2 : రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్ మున్సిపాలిటీ 11వ వార్డు ఆదర్శనగర్ కాలనీ లో కొత్త వాటర్ లైన్ కోసం గుంతల తవ్వకాల్లో పాత పైపులకు రిపేర్ కావడంతో రోడంత నీరు వృధాగా ఏరులై పారుతుంది కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వీటినీ త్వరగా పరిష్కరించాలని కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు

## హుస్సేన్ సాగర్‌లో దూకి యువతి ఆత్మహత్య




హైదరాబాద్, ఫిబ్రవరి 3: హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో దూకి విజయలక్ష్మి (26) అనే యువతి బలవన్మరణానికి పాల్పడింది. కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన సదరు యువతి ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు మీడియాకు వెల్లడించారు. విజయలక్ష్మి రెండు రోజుల క్రితం బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, మంగళవారం హుస్సేన్ సాగర్‌లో ఆమె మృతదేహం లభ్యమైంది. పెళ్లి కావడం లేదనే బాధతో ఆమె ఆత్మహత్య చేసుకుందనే ప్రచారం జరుగుతోందని.. ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమని పోలీసులు స్పష్టం చేశారు. విజయలక్ష్మి గత కొంతకాలంగా తీవ్రమైన డిప్రెషన్ (మానసిక కుంగుబాటు)తో బాధపడుతోందని వెల్లడించారు. డిప్రెషన్ నుంచి బయటపడటానికి ఆమె క్రమం తప్పకుండా మందులు వాడుతోందని తెలిపారు. మానసిక వేదనను భరించలేకనే యువతి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కూకట్‌పల్లి పోలీసులు అనుమానిస్తున్నారు. యువతి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.